## 7.2.1 భావ కవిత్వం

సమకాలీన సాహిత్యంలో భవిష్యద్దర్శనం భిన్న కోణాలలో ప్రదర్శిత మవుతుంది. ప్రాచీన కాలంనుండి నేటివరకు భవిష్యత్తును వీక్షించిన వారున్నారు. ఆ భవిష్యత్తును స్వప్నలోకంలోనూ, మార్క్స్ ప్రభావంలోను, తిరుగుబాటులోను, విప్లవంలోను చూశారు. మార్పు అనేది సహజం. మానవుడు అనాదినుండి ఆశించేది మార్పే. కాని ఆ మార్పును సుగమనం చేసుకోవటంలో సమీప భవిష్యత్తును, సుదూర భవిష్యత్తును, దూర భవిష్యత్తును వీక్షిస్తాడు.

భవిష్యవాదులు భవిష్యత్తును possible, probable, preferable అని మూడు విధాలుగా సూచిస్తున్నారు. 1. సంభవనీయ భవిష్యత్తు (possible) వెంటనే జరిగేది. ప్రయత్నం వల్ల కృషి ఏకాగ్రత వల్ల సంభవించేది. 2. సంభావ్య భవిష్యత్తు (probable) భవిష్యత్తులో జరగవచ్చు, జరగకపోవచ్చు 3. అధిగణన భవిష్యత్తు (preferable) ఉన్న మార్గాలలో ఒకదానిని గణించటం. ఈ పద్ధతిలో వర్తమానం భవిష్యత్తుకు దారితీస్తుంది. కొన్ని సందర్భాలలో ఇది విఫలం కావచ్చును.

ప్రేమ బంధంతో ప్రపంచాన్ని ఒక్క తాటిమీదుగా నడిపినవాడు గురజాడ అప్పారావు. కొత్త పాతల మేలు కలయికతో నూతన ఆలోచన విధానాలతో తెలుగు కవిత్వాన్ని సరికొత్త రీతిలో ముందుకు నడిపిన సంఘ సంస్కరణవాది గురజాడ. ఇతని వ్యక్తిత్వంలోను, కవిత్వంలోను విశ్వజనీనత కనిపిస్తుంది.

జాతిబంధాలన్న గొలుసులు జారి, సంపదలు కలుగుతాయని, ఎల్ల



లోకం ఒక్క ఇల్లై, వేల నెరుగని ప్రేమబంధం ఏర్పడుతుందని ఆశించారు.

"మతములన్నియు మాసి పోవును
జ్ఞాన మొక్కటె నిలిచి వెలుగును
అంత స్వర్గ సుఖంబులన్నవి
యవని విలసిల్లున్" [1] – తోకచుక్క

భవిష్యత్తు ఉజ్జ్వలంగా ఉంటుందని శాంతితో సుఖించేకాలం ముందున్నదని విశ్వశ్రేయస్సును ఆశించి దానికి పునాది ఎటువంటిదై ఉండాలో వర్ణించారు రాయప్రోలు సుబ్బారావు.

"దేశ ఋణమును దేవ ఋణమును
మాతృ ఋణమును మనిషి ఋణమును
తీర్పగలిగిన దీక్షితుడనని
తెలిసి తెలిపే సమయమోయ్" [2] – భద్రయాత్ర

కులపాలికా ప్రణయ తత్త్వానికి నండూరి సుబ్బారావు ఎంకి పాటలు పేర్కొన దగినవి, పరిపూర్ణత్వాన్ని సాధించిన ప్రణయ జీవితం ఆదర్శ ప్రాయమైనది. కర్మ సిద్ధాంతాన్ని, వెనక జన్మ, ముందు జన్మల తత్త్వాన్ని ప్రబోధించారు.

స్వాప్నిక జగత్తులో భవిష్యత్తును దర్శించారు భావకవి దువ్వూరి రామిరెడ్డి. సగం జాగ్రదవస్థ, సగం స్వప్నావస్థ సత్యమో, భ్రాంతియో, స్వప్నమో గాని ఇంద్రజాలంలా ఎదురుగా కనపడుతున్నది. అది సత్యమైతే ఆశ్చర్యం, స్వప్నమైతే

---

1. గురజాడ అప్పారావు, ముత్యాల సరాలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, ప్రథమ ముద్రణ 1955, ఆరవ ముద్రణ 1972, పుట 4.
2. రాయప్రోలు సుబ్బారావు, మిశ్రమంజరి, అజంతా ప్రింటర్స్ ప్రథమ ముద్రణ 1963, పుట 25.

ఆనందం. వాస్తవంగా జరుగుతుందో లేదో తెలియని సందిగ్ధావస్థలో ఉన్న కవి కలగా మిగిలినా, ఆనందమే క్షణికానందాన్ని కలిగించినందుకు అది సత్యమైతే ఆశ్చర్యమని అంటున్నారు. తనకు కనుల ఎదుట కనిపించిన భవిష్యద్దర్శనం సమీపంలో లేనిది దూరభవిష్యత్తును సూచించేదిగా కనిపిస్తుంది. రాజు–పేద, పేద–కూలి, యజమాని సమాన బంతిలో ఆసీనులవ్వటం సంభావ్య భవిష్యత్తుగా గోచరించింది.

కుల వర్ణ భేదాలు పాటించక, ఒక కడుపున బుట్టి ఒక చన్ను పాలు తాగిన రీతి, ఒకరినొకరు అన్యోన్య సహాయమర్థించువారు విశ్వమానవత, వసుధైక కుటుంబం భూమిపై స్థాపింపబడి, మానవ కల్యాణ మందిరమయ్యిందని ఊహించారు, దువ్వూరి వారు భవిష్యత్తును ఈ విధంగా దర్శించారు.

"ఏక కుటుంబమై యీ ప్రపంచంబు
స్వర్గంబు భూమిపై స్థాపింపఁబడియె.
అభ్యుదయాంశువు లన్ని మూలలను
నవనవోజ్జ్వల జీవనంపు దీపముల
వెలిగించుచుండె; నీ విశ్వమంతయును
మానవకళ్యాణ మందిరంబయ్యె"[1]. – భవిష్యద్దర్శనము

సహపంక్తి ఆసీనులు కావటం, అన్యోన్య సహాయాన్ని అంచటం ఏక కుటుంబమై స్థాపించబడటం, అభ్యుదయాంశతో విశ్వమంతా మానవ కల్యాణ మందిరం కావటం ఆయన కవిత రాసిన నాటికి కలగా మిగలవచ్చు, సత్యమూ కావచ్చు అనే తలంపు కవికి ఏర్పడింది. జరగవచ్చు జరగక పోవచ్చు అనే సంభావ్య భవిష్యత్తును సూచిస్తుంది. లౌకిక యథార్థావస్థకు వచ్చినపుడు అక్కడున్న తాళవృక్షాలు బొగ్గు కంబాలుగా కనిపించి చిమ్మచీకటి ఆవరించిందని ముగించారు.

1. దువ్వూరి రామిరెడ్డి, కవికోకిల గ్రంథావళి, ఖండకావ్యములు, ప్రథమ ముద్రణ 1936, ద్వితీయ ముద్రణ 1956, పుట. 117



"అంతలో లౌకిక యాథార్థ్యములను
భావంబు వ్రాలెను బక్షివిధాన;
బొగ్గుకంబము లట్లు పొడకట్టుచుండెఁ
దత్ప్రాంతముల నున్న తాళవృక్షములు!
చిమ్మచీఁకటి నొంటిఁ జిక్కుకొనియుంటి" [1]. –భవిష్యద్దర్శనము

దువ్వూరి రామిరెడ్డి 'భవిష్యద్దర్శనము' పచ్చని పొలాల సౌందర్యం ఆకర్షించగా కథన పద్ధతిలో కొనసాగిన కవిత. కలలో, స్వప్నంలో జాగ్రదావస్థలో వాస్తవమో అవాస్తవమో గాని కమ్మని ఊహ. రారాజు అందరితో బాటే అవనిపై కూర్చున్నాడు. విశ్వమంతా మానవ కళ్యాణ మందిరమయ్యిందనేది అందమైన ఊహ. కాని లౌకిక యథార్థాలు గుర్తొచ్చినప్పుడు తాళవృక్షాలు బొగ్గుకంబాలుగా కనిపించాయి. చిమ్మచీకటిలో జిక్కుకున్నారు.

"ఖండాంతరంబుల కపటనాటకము
కాల మెప్పటికైన గనికరము లేక
నీ ముసుంగును జీల్చి నిజమూర్తి జూపు
భావి సంగర ముష్టి బట్టుపడనీక
జగతిని కాపాడు సకల దేశముల
కవి మహాశయులొక్క కట్టుగావలయు
నిదియె నాయాశ కలయు నిక్కంబగు కాలంబు రాదె?"
అల్లదె! దర్శించు దవతరించెదని
ఆధ్యాత్మిక యుగంబు! నానంద ముఖము"![2] – సమరతృష్ణ

ఖండాంతరాలలో సౌభ్రాతృత్వ భావం కొరవడి కపట వేషధారులై ఉన్నవారి

1 దువ్వూరి రామిరెడ్డి, కవికోకిల గ్రంథావళి, ఖండకావ్యములు, ప్రథమ ముద్రణ 1936, ద్వితీయ ముద్రణ 1956, పుట. 117

2. కవి కోకిల గ్రంథావళి, దువ్వూరి రామిరెడ్డి, ప్రభాత ముద్రణాలయము, నెల్లూరు, పుట 120.

ముసుగు చీల్చి జగతిని కాపాడడానికి సకల దేశాల్లోని కవులు ఒక్కటై సమరాన్ని సాగించాలని కవి దువ్వూరి రామిరెడ్డి కోరికను వ్యక్తపరచారు. ముందు ముందు ఆధ్యాత్మిక యుగం అవతరిస్తుందని ఆశించారు. కోరిక, ఆశ భవిష్యత్తుకు పునాదులు.

భావకవులు ఊహాలోకంలో ప్రేయసిని స్మరించారు. స్వప్నలోకంలో తేలిపోయారు. దువ్వూరి రామిరెడ్డికి భవిష్యత్తు నాడు ఒక స్వప్నంలా కనిపించింది. భావి ప్రత్యూషను దర్శించటానికి భారత పౌరులకు 'మేలు కొలుపు'లు పాడారు.

విశ్వనాథ సత్యనారాయణ (1899–1978) చేపట్టని సాహిత్య ప్రక్రియ లేదు. మహాకావ్యాలు, నవలలు కథలు రూపకాలు... సాహిత్యంలో అన్ని ప్రక్రియలను తెలుగు ప్రజానీకానికి అందించారు. ఆంధ్రాభిమానం, జాతీయాభిమానం గలవారు.

విశ్వనాథ ఇంగ్లీషు చదువుల వల్ల మనవారిలో స్వాతంత్ర్యం, వ్యక్తి గౌరవం అధికమవ్వటం, మర్యాదలలో పూర్వపద్ధతులు మాయమవ్వటం వంటి అంశాలను సానుభూతితో వర్ణించారు. సమకాలీన సమాజాల్లో వెర్రిపోకడలను విమర్శిస్తూ 'పంచ శతి' లో పాఠకుల అజ్ఞానాన్ని అవహేళన చేసారు.

"తొలినాళుల పద్యార్థము
తెలియనిచో పాఠకునిది దెలియమియీనా
ఈల వ్రాసిన కవి దోషము
కలి ముదిరిం కొలది చిత్రగతులను నడచున్." [1]

భ్రష్ట యోగి ఖండ కావ్యం (1916–1926)లో 'భవిష్యత్తు' అనే కవితలో

1. భ్రష్టయోగి (ఖండ కావ్య సంపుటి), విశ్వనాథ సత్యనారాయణ, వి.యస్.యన్ అండ్ కో, విజయవాడ, 1970, పుట 12.



భూత వర్తమాన భవిష్యత్కాలాలను దర్శించిన రీతి విలక్షణంగా గోచరిస్తుంది.

పైన కటిక చీకటి, నడుస్తున్న మార్గం కంటక శిలావృతం, కాల ప్రవాహంలో లాగుకొని పోతున్న దనిపించే వర్తమానం– అంతలో దూరాన కనవచ్చె పురుషుడొకడు, శతసహస్ర మార్తాండ తేజస్సహితుడు, హృదయ బాధా నివారణ మూర్తి, కటిక చీకటినుండి ఉదయించే సూర్యుడు దూరంగా కనిపించి చీకటినుండి వెలుగులోకి నడిపించటానికి వచ్చాడన్నట్టుగా చేరువలోనే కని పించాడు. అతి ప్రయాసతో అతడున్న తావుకు పోయి చూస్తే అంజనావనీధరలా అతి భయంకరంగా కనిపించాడు. తూర్పున వెళ్ళిన అతనికి వెనుదిరిగి చూస్తే శాంతంగా నిలచి నవ్వే చిత్ర పురుషుడు కనిపించాడు.

"వివిధసూచీముఖోపలవిషమమైన
మార్గమున బోవుచుంటిని మరల నేను
ఇటుల జూతునుగద, ముందు నీ పురుషుఁడె
అతిమనోహరమూర్తి నన్నాహరించు." [1] – భవిష్యత్తు

మళ్ళీ అతడి ముందు ఆ పురుషుడే అతి మనోహరంగా అతడిని ఆకర్షించాడు. సూర్యాస్తమయాలను వర్ణిస్తూ ఆ సూర్యుడే మార్తాండ తేజస్సహితుడు, అతి భయంకరాకృతి గలవాడు, శాంతిస్వరూపుడు, అతి మనోహరస్వరూపుడు. ఇదంతా కవికి స్వప్నంలా కనిపించినా వాస్తవాన్నే వర్ణించాడు. వర్తమానంలో నడుస్తున్న అతనికి సమీపంలోనే ఉదయసూర్యుడు కనిపించాడు. శ్రమతో అతడిని చేరే ప్రయత్నంలో సూర్యుడు అస్తమించి మళ్ళీ ఉదయించాడు. వర్తమానంలోనే భవిష్యత్తును చూసి, భవిష్యత్తుగా భావింపబడే కాలాన్ని వర్తమానంలోనే గడిపి, ఆ వర్తమానమే భూతకాల మవుతుంది.

1. భ్రష్టయోగి (ఖండకావ్య సంపుటి) 1916–1926. విశ్వనాథ సత్యనారాయణ వి.యస్.యన్.అండ్ కో, విజయవాడ, 1970, పుట 12.

సూర్యుడుదయించి అస్తమించే ప్రాతర్మధ్యం దిన సాయంకాల సమయాలలో భూత భవిష్యత్ వర్తమాన కాలసూచన ఉందంటాడు కవి. భవిష్యత్తును గురించి విశ్వనాథ సత్యనారాయణ అద్భుతంగా చిత్రీకరించారు.

నాయనిసుబ్బారావు 'సౌభద్రుని ప్రణయ యాత్రలో' కులపాలికా ప్రణయాన్ని చిత్రించారు. భావకవికి ప్రేయసియే ప్రధాన కావ్యవస్తువు. ఆమె సాక్షాత్కారానికై వేచియుంటాడు.

"ఈ వియోగవ్యధావల్లి యిట్టులెన్ని
స్వాతివర్షాంబుధారల చవులుగొనునొ
ఈ ముసురుకొన్న మేషమ్ము లిట్టె విరియ
మంజులము కాదొకో చంద్రమండలమ్ము
ముంచుకొనివచ్చు నీ స్వాతిముసురులందు
ప్రళయనిర్ఘాతపాతముల్ ప్రబలునేమొ" [1] – భవిష్యత్తు

ప్రేమించిన ప్రేయసి అప్రాప్త మనోహరి. ఆమె అనుగ్రహం కోసం, దర్శన భాగ్యం కోసం ఎదురు చూస్తున్నాడు ప్రియుడు సౌభద్రుడు. గతకాలంలో మంచులచేత ప్రణయ సందేశాన్ని పంపించాడు. తుషార దూతికలు ఈనాడు తిరిగివచ్చి మధ్యేమార్గ సారసాలోకన విశేషాలను వివరిస్తుంది. కాళిదాసు మేఘసందేశంలోని సన్నివేశాన్ని పోలినటువంటిది. ప్రేయసి ప్రియుల మధ్య మంచుల దౌత్యం.

"కలతనిద్దురలో నీవు కన్ను గొనల
నొకటి రెండు బాష్పాంబువులుబుక ముగ్ధ
మృగశిరారూపమున దోచి స్మృతి పథమున
"నాథ! తేపుగదోయి!" యన్నయటులయ్యె

ఆ నిముసమ్ములో హృదయమందున నాసలు రేగ చూచితిన్

1. సౌభద్రుని ప్రణయయాత్ర, నాయని సుబ్బారావు – 1970, పుట – 44,46



నీ నయనాంచలమ్ముల ఘనీభవమయ్యె దయారసాంబుధుల్
ప్రాణమువచ్చి నిన్ను భుజబంధమున్ గరగింప లేచితిం
బో నను మోసపుచ్చి యిటు పోదువె కాలములోన లీనమై" [1] – రేపు

రోహిణి తరువాత రాబోయే మృగశిరను సూచిస్తూ ప్రేయసి 'రేపుగదోయి' అన్నట్టుగా హృదయంలో ఆశలు రేపింది. భావకవులు కాలాన్ని కూడ స్వప్నంలోనే వీక్షించటం వల్లనేమో భవిష్యత్తు కూడ కలగానే కరిగి పోయింది.

భావకవితా ప్రవక్తగా భాసిల్లిన కృష్ణశాస్త్రి కరుణరసాత్మకం, నిరానంద సూచక మయిన కృష్ణపక్షంలో స్వేచ్ఛా ప్రియత్వం, దుఃఖం, ప్రేమ, ఈశ్వరారాధన కావ్యంలో ఆత్మాశ్రయమై రూపొందింది. ఆత్మ సౌందర్యం, అంతర్ముఖత్వం, ఆరాధన, ఆత్మార్పణ, అలౌకికానందం, పూర్వజన్మ వాసనలు, దార్శనిక దృక్పథం, సుఖ దుఃఖ ప్రదర్శనం కవి భావ ప్రదర్శనకు ప్రధానమైన అభివ్యక్తి మార్గాలు.

ఆశించినవి దక్కక పోగా సారహీనమైన జీవితానికి కోరికలే మిగిలి 'కలయే జీవితము'గా[2] నిలిచింది. తన కవిత్వం కొత్త బలంతో చలంతో పగలూరేయీ నడుస్తూ 'అజ్ఞాత భావి కాలపు యుగాల'[3] వరకు నిలుస్తుందనే ఆశను వ్యక్తం చేసారు

1. సౌభద్రుని ప్రణయయాత్ర, నాయని సుబ్బారావు – 1970, పుట–44,46
2. చుక్కలు, కృష్ణ పక్షం, కృష్ణశాస్త్రి, ఓరియంట్ లాఙ్మన్ లిమిటెడ్, 1997, పుట 52
3. ఈ పయనపుందెరువు, కృష్ణ పక్షం, కృష్ణశాస్త్రి, ఓరియంట్ లాఙ్మన్ లిమిటెడ్, 1997, పుట 93.

"ఆశలు కళ్ళేలు లేని
గుర్రా లీతనికి !
మన్ను మిన్ను కలియువరకు
తెన్ను వీనికి " [1]

ఆశలు దుఃఖానికి కారణమంటాడు. అందరాని వాటి కోసం అర్రులు చాచి నిరాశపడటం మానవనైజం. నిరాశ దుఃఖానికి హేతువు. అయినా ఉగాది నాడు భావి అంతా బంగారపుపంట అవుతుందని, శాంతికి నిలయమని సమైక్యతా భావంతో ఉంటారని ఆశించారు.

"భావియంత బంగారపు
పంట యగును గాక !
రాగల కాలము శాంతికి
తావల మగుగాక !
గుండెలెల్ల కలిపి ఒక్క
దండగాగ కూరిచికొని,
ముందు ముందు ఈ మానవు
లందరు ఉందురు గాక " [2] – ఉగాది

కలికాలం కొండచిలువలా, పెద్ద బండలా దొర్లి పోయింది. వెనుక నడకలు గల పీతలాంటిది భూతకాలం. వర్తమానం ఉజ్జ్వలంగా భవిష్యత్తు మందిరావాసంగా కవి దర్శించాడు.

"మంది కృత మహాయుగం !

1 & 2. పల్లకీ, దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి పద్యాలు, దేవులపల్లి కృష్ణశాస్త్రి సన్మాన సంఘ ప్రచురణ, 1975, పుట 62,63.



ముందున్నది ముందున్నది
ముందున్నది మందే, మరి
మందే యువ మహాయుగం !
పీతలాంటి భూతం మన
తాతల్దీ తండ్రుల్దీ !
రోత రోత రోత – మంది
ప్రాత ర్వియదావాసం !
ప్రాతరుజ్జ్వ లాకాశం !
భావి మంది రావాసం !
స్ఫీత జీవ ధౌత నాక
నేతలం విధాతలం!
స్ఫీత చలత్ ధౌత లసత్
చేతనులం నూతనులం" [1] – యువగీతం

ఒకనాడీ భువి స్వర్గ ధామం. స్వాతంత్ర్య కీర్తికలది. నేడు అలసత్వం, లోభత్వం అలమిన మనసుతో విషానలమై దాస్యం అలమింది. దాస్యానికి కారణం మనసులే. చేతనానికి, మనసుకి ప్రాధాన్యమిచ్చి మార్పుకి ఇవి ప్రధానం అంటున్నారు.

"ఒక నా డీ భువి సకలము స్వర్గము
సుకముల సొగసుల సూనారామము
వికచ విభాత శుభామల ధామము
ప్రకట యశోవిలసితము స్వతంత్రము

1. పల్లకీ, దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి పద్యాలు, దేవులపల్లి కృష్ణశాస్త్రి సన్మాన సంఘ ప్రచురణ, 1975, పుట 64-65

కులముల మతముల కూడని ఈసుల
అలసత కృపణత అలమిన మనసులు
ఖల పరపన్నగ గాఢ విషానలా
విలమై, ఖిలమై అలమెను దాస్యము "[1] - మణికింకిణి

స్వతంత్రం, శాంతి, అభ్యుదయం అరుణతారగా స్వతంత్ర విభాత ఆకాశంనొసట పొడుస్తుంది.

"ముందు గలదు మన జాతికి ముక్తి, అమర జీవరక్తి !
క్రిందు వెనుక గనక నడువుడందరు ; అభ్యుదయ విభా
ఆకాశము నొసట పొడుచు అరుణారుణ తార "![2] - మహతి

మానవులలో హృదయ సంస్కరణ అవసరం. మాలిన్యాలను పోగొట్టి సంస్కార వంతులైతే హృదయమే దేవాలయమవుతుంది. సోమరితనం లేకుండా వేగవంతంగా కదిలితే చేరుకోవాలనుకున్న గమ్యాన్ని చేరుకోగలమని అంటున్నారు కృష్ణశాస్త్రి. ఆభ్యుదయ కవుల్లోనూ ఈ భావాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

"నాల్గుదిక్కుల నడిమినాడు నాడుల నుండి
నర నారు లందరూ నడవండి, నడవండి!
మూల్గు సందేహమ్ము, మోసమ్ము, కుటిలత,
నీల్గు హింసయు వెనక విడవండి, నడవండి !
అదిగదిగొ... "[3] - రాజఘట్టం.

భోగలోలత విడచి త్యాగనిరతి కలిగిన శివుడిని అనుసరిస్తేచాలు.

---

1,2,3 మంగళ కాహళి, కృష్ణశాస్త్రి గేయ సంహిత-2, రాజహంస ప్రచురణలు, మద్రాసు,1982, పుట 4, 10, 30.



"మనిషి శివు డవడమే గాంధీవరం - బాపు
ననుసరిస్తే చాలు మన మందరం !
కమ్మగా బతికితే గాంధీయుగం"[1] - కొత్త కోవెల.

ప్రజారథం తరలి ప్రపంచపథం వైపుగా పయనిస్తే వచ్చేది శాంతియుగం, ప్రజలకది అభ్యుదయం అవుతుంది. గతకాలం నశించి వర్తమానంలో సమభావం పెరిగి మునుముందు వికసించే మార్గంలో మానవుడే మకుటధారి. ఆ ప్రపంచమే కొత్త కోవెల.

"రాగల దది శాంతి యుగం
కాగల దభ్యుదయ జగం
వికసించే విధానమున
మకుటధారి మానవు డని "[2] - కొత్త కోవెల.

ఈ జగత్తంతా పెద్ద చెఱసాల. మనిషి పురోగమన గాథని తిరిగి చూస్తే వెలుగు పంచలేని తెలుపు, నలుపు, తీయదనం, చేదుతో కూడిన జీవకోటి బంధనాలు. ఈ గతమంతా హతమై మహోదయ ఆగమనం కోసం ఎదురు చూస్తున్నారు అబ్బూరి వరద రాజేశ్వరరావు.

"మనిషి పురోగమన గాథ
మనిషి మరోమార్గ శోధ !
జనంలోన జగం విరిగి
మనంలోన జగం కరిగి

---

1,2 మంగళ కాహళి, కృష్ణశాస్త్రిగేయ సంహిత-2, రాజహంస ప్రచురణలు మద్రాసు - 1982, పుట , 31, 36.

గతం, జగం, జనం మనం

హతం." [1]

భూత, భవిష్యత్, వర్తమాన కాలాల గురించి చలనం లేక కాళ్ళుతెగి పడి ఉన్నది భూతకాలమని, కళ్ళులేనిది భవిష్యత్కాలమని, మహా ఆర్తగళం కలది వర్తమాన కాలమని వర్తమానానికే ప్రాధాన్యం ఇవ్వటం కనిపిస్తుంది.

"కాళ్ళు తెగిన వాగ్దానం

గదికి వెనక

కళ్లులేని భావి శకం

కలలు కనక

వర్తమాన మంత ఒక మ

హార్త గళము !

పురానేక పాప ఫలపు

పరీమళము !" [2]

ప్రకృతిలో ప్రతి చేష్ట కొత్తరూపు ధరించి, కర్మయోగమై తనంత తానుగా పరిపక్వత పొందింది. స్పందన పొందిన ప్రతిజీవి చైతన్య చైత్ర రథమై జాతర జరుపుకున్నారు.

"ఈ వసంత నవోదయవేళ

ప్రకృతిలో ప్రతి చేష్టా కొత్త రూపులు దాల్చింది

క్రొత్త రూపులు తాల్చిన ప్రతి చేష్టా కర్మయోగమై పచేళిమయింది.

స్పందన పొందిన ప్రతిజీవీ చైతన్య చైత్రరథమై జాతర సల్పింది".

– ఈ వసంత నవోదయవేళ

1,2 అబ్బూరి వరద రాజేశ్వరరావు, కవితా సంచిక, సంకలనం : ప్రభాకర్ పరకాల, విశాల గ్రంధశాల, 1993, పుట36, 37.



అభ్యుదయ విపంచి మిటినఈ సుప్రభాత గీత నినాదంతో అవినీతి, అక్రమ పాలన, అన్యాయార్జన అంతమొందించి భవిష్యత్తుకు రాచబాటలు నిర్మించాలని ఈ సాధనకు కఠిన యోగ్యులు అవసరమని దేశాభ్యుదయం కోసం కుందేటి కొమ్మునైనా సాధించాలనేది కవయిత్రి ఆరాటం.

"భవితవ్యానికి రాచబాటలు

అవితథంగా పఱచుకొంటున్నాయి.

ఈ సాధనలో

నిషధయోగ్యులను నిర్మించాలి

దేశంకోసం, దేశాభ్యుదయం కోసం

శశవిషాణమైనా సాధించాలి.

వివిధ యోగ్యులను నిర్మించాలి

శశ విషాణమైనా సాధించాలి"

"భవిష్యదర్థానికి బంగరుబాటలు వెయ్యాలి

భారతమాతకు హారతు లియ్యాలి " [1]

– యువతరానికి స్వాగతం నవశకానికి రుచిరాగతం

భూతకాలంలో ఆనందం అర్ణవంగా పొంగిందని ప్రకృతి పరిమళాలు వెదజల్లాయని అవ్వ చెప్పినా వర్తమానంలో ఏ ఆనందమూ లేదని మానవజీవితాల్లో, భావాల్లో, మస్తిష్కంలో కరువు ఏర్పడ్డదని రచయిత్రి వర్ణించారు. దేశాభ్యుదయానికి సాధించవలసిన అంశాలను వివరించారు.

"అప్పుడు, వెనుక నీవు వచ్చినప్పుడు

1, ఒక్క చిన్న దివ్వె, డా. ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ, స్వీయ ప్రచురణ, 1980, పుట 35, 38.

ఆమ్రఫలాలలో రసహృదయం ఆమ్రేడితమై ఉండేదనీ
శుకపికగళరవాల్లో శుష్కవాగాండరదంభప్రలాపన లేదనీ !
మల్లెల్లో సౌరభ సౌందర్యం వెల్లివిరిసిందనీ
ఉన్న కరువల్లా మా భావాల్లో! మా మస్తిష్కంలో !
మా చేతల్లో ! మంచి తనానికి నోచుకోని మా సంఘంలో
నిజాయితీ లేక, యిజాలతో బుజాలు తడుముకొంటూన్న
రాజకీయాల్లో !” [1]

హేతువాద దృష్టి, చారిత్రక దృష్టి, సత్య దృష్టి త్రిపురనేని రామస్వామి చౌదరి రచనలకు పునాదిగా నిలిచాయి. వీరు వర్ణవ్యవస్థను విమర్శించారు. మత వ్యవస్థను కూకటి వేళ్ళతో పెళ్ళగించాలని, అగ్రవర్ణాలవారిలో ఆత్మ పరివర్తన రావాలని మూఢ భక్తి తొలగిపోవాలని ఆశించారు.

“ఒక్క జాతియందుద్భవ మొంది కూడ
స్పర్శ దోషంబు దృష్టి దోషం బటంచు
బతితమై పోవుచుండె బ్రబ్రష్టమగుచు
వెలుగు జాతి పునస్సృష్టి వలదే చెపుము” [2] – భగవద్గీత

‘ఏనాడు మాజాతి దృష్టి మాంద్యము వాసి చుట్టు ప్రక్కల దేరి చూడగలనో’నని సంకుచిత స్వభావం లేని జాతి కోసం. ఆలయ ప్రవేశం లేని సంతతినుద్ధరింపగల సత్పురుషుండుదయించాలని కులవాహినీ ప్రళయం

1. ఒక్క చిన్న దివ్వె, డా. ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ, స్వీయ ప్రచురణ, 1980, పుట 42.
2. త్రిపురనేని రామస్వామి చౌదరి, భగవద్గీత, నవోదయ పబ్లిషర్స్, విజయవాడ, ప్రథమ ముద్రణ 1945, ద్వితీయ ముద్రణ 1959, పుట 86.



నవఖండంలో ఉండకూడదని బడుగువర్గాల వారికి ఉన్నత స్థానాన్ని కల్పించే మరో ప్రపంచం కోసం సముజ్జ్వల భవిష్యత్తును కాంక్షించాడు కవి జాషువ.

“కులమత విద్వేషంబుల్
తలసూపని తావులే కళారాజ్యంబుల్” [1]

‘విశ్వమానవ సౌభ్రాత్ర, నిర్మాత, నిర్జాతి సంఘం నా ఆదర్శ’మని సాంఘిక న్యాయాన్ని కోరారు.

బెజవాడ గోపాలరెడ్డి మానవుడు దివ్య మానవుడుగా రూపొందాలని పదివేల ఏళ్ళకు మానవులలో మానవత్వం పరిణమించే విధానాన్ని వర్ణించారు.

“మానవులే దేవతలై పోవాలె
అమరత్వం అడుగంటలె
ఉదార ఉదాత్త భావాలేస్థిరమై పోవాలె” [2]

‘ఏమి చేయలేదు; ఏమైనా చేస్తుంది ఎంతైనా చేస్తుంది’. ఇది భూత, వర్తమాన, భవిష్యత్కాలాలను సూచిస్తుంది. బెజవాడ గోపాలరెడ్డి భూత భవిష్యత్ వర్తమాన కాలాలను ‘నేడు’ నర్తకిలా కళాత్మకంగా నర్తిస్తుంది. వర్తమానం అంతలోనే ‘నిన్న’లో అంతర్భవిస్తుంది. కాలం భ్రమణశీలం, పరిణామశీలం.

‘కాలము’ అనే కావ్యంలోని అతిమానవ అవతరణ శ్రీ అరవిందుల దివ్య మానవ అవతరణ సిద్ధాంతాన్ని సూచిస్తుంది. మానవ చైతన్యం భౌతిక భూమిక నుండి సాధన వల్ల భిన్న భూమికలను (భౌతిక, ప్రాణిక, బౌద్ధిక, మానసిక, ఆధ్యాత్మిక భూమికలు) దాటి పరిణామం చెందుతుంది.

1. జాషువా, నేతాజి, హేమలతా లవణం, విజయవాడ 1978, పుట 20
2. బెజవాడ గోపాలరెడ్డి, కాలవాహిని, ఆంధ్ర సారస్వత పరిషత్తు 1979, పుట 26.

'నేడు' కావ్యంలో కాల స్వభావాన్ని వర్ణించారు.

"మరణించిన భూతకాలపు అంధ కారము
జన్మించని భావికాలపు అంధకారము
మధ్యమెరిసే జ్యోతిరింగణము నేడు" [1] – కాలము

వర్తమానం భయద, సౌందర్య, సౌకుమార్య, ఔన్నత్య, అమృతత్త్వ రూపాలను చిందిస్తూ వర్తిస్తుందని భూతకాలం గుహ అని, స్మృతి రాజ్యమని, సుఖదుః ఖాత్మకమని, గోడ దాటి చూపు ప్రసరించలేనిది భవిష్యత్తు అని 'కోర్కెల రెక్కలపై కలల అలలపై ఎగురుతూ చూపు చూస్తుంది రేపుల ముఖాలను, అదే వాంఛా ప్రపంచము, స్వప్న సామ్రాజ్యం'.

"నిన్నలు, నేడులు, రేపులు, అనాది కాల వంశ పారంపర్యం
అనంత నిరంతర ప్రయాణం
క్లాంతి రహిత నిత్యకాల విహారం" [2] – కాలము.

పరిణామం ప్రకృతి సహజం. దానికి తలవంచక తప్పదు. ఏనాడో నిర్మించిన పునాదులను పెకలించటానికి మనిషిలోని కుళ్ళును క్షాళనం చేయటానికి వెట్టి చాకిరి బ్రతుకులిక ఉండవని, పేద ధనిక వర్గాలుండవని సమతాభావం నెలకొంటుందని భావిస్తున్నారు బిజినేపల్లి లక్ష్మీకాంతగుప్త.

"పరిణామం ప్రకృతి స్వభావం

1,2 బెజవాడ గోపాలరెడ్డి, కాలవాహిని, ఆంధ్ర సారస్వత పరిషత్తు 1979, పుట 27-31.



అరిష్ట దాయియైన అభీష్ట దాయియైన
తరమగునే ఎవరికైన ?
తలవంచక 'మార్పు' ముందు" [1] – మార్పు.

'నేడు' నుండి మొలకెత్తేది రేపు. రేపటి భవిష్యత్తుకు మూలం ఈనాడేనని కవిత్వీకరించారు నండూరి రామమోహనరావు. ఈనాడు నివురుగప్పిన నిప్పు రేపు రగులుతుంది. ఈనాడు ముడుచుకున్న పిడికిళ్ళు రేపు పిడుగు రాళ్ళవుతాయి.

రేపటి మన ప్రతి అడుగూ
రెండు మైళ్ళ పొడుగు !
రేపటి వ్యక్తికి తలపై
నక్షత్ర కిరీటం !" [2] – రేపు

వర్ణవ్యవస్థను నిరసించి, సమధర్మం రావాలని, మతవైషమ్యం తొలగాలని, అవిలేని లోకం నిలవాలని భావ కవులు మొదలుకొని నేటి కవుల వరకు అందరూ ఆశించేది ఇదే. సమాజ నిర్మాణంలో భౌతిక పరిణామంతో బాటు అంతరంగ పరిణామాన్ని ఆశించి ఎదురుచూసిన కవులు. భావకవులు స్వప్నావవస్థలో మార్పు సంభవమో అసంభవమోననే సందిగ్ధావస్థలో కొంతమంది కాలాన్ని వీక్షిస్తే, మరికొంతమంది కవుల దృక్పథంలో క్రమానుగత పరిణామం కనిపిస్తుంది. సమాజ ఆకృతిని చూసి ఆక్రోశించినవారు కొంతమంది, అయితే దానికి పరిష్కార మార్గాల నెన్నుకున్నవారు కొంతమంది. కాల అవగాహనను వస్తువుగా చేసి రచించిన వారు కొద్దిమంది కవులు మాత్రమే. కొందరు వర్తమానమే భవిష్యత్తుకు

1. బిజినేపల్లి లక్ష్మీకాంతగుప్త, నవ్య జగత్తు ఖండ కావ్య సంపుటి, వాసవీ సాహిత్య పరిషత్తు, హైదరాబాదు, పుట 71.
2. నండూరి రామమోహనరావు, ఉషస్విని, సురుచి ప్రచురణలు, ఏలూరు, 1970, పుట 48.

దారితీస్తుందన్నారు. భూత, భవిష్యత్కాలాలకు ప్రాధాన్యమివ్వక వర్తమానమే ప్రధానమని పలికారు. గతకాలం గతించాలనే దృక్పథంతో అందరూ ఏకీభవిస్తున్నారు. గతకాలంలో మంచి అన్నది లేకపోలేదని స్మరించి అటూ ఇటుగా ఊగిసలాడిన వారున్నారు. మూడు కాలాలను అంగీకరించినవారు ఒక్క విశ్వనాథ మాత్రమే.

భూత, వర్తమాన, భవిష్యత్కాలను గురించి కవుల అవగాహనను పరిశీలించినట్లయితే కాలాన్ని గురించి వారికున్న దృక్పథాలనుప్రాతిపదికగా చేసుకుని వారి అంతరంగమనో భావాలను స్పృశించవచ్చు. ఈ కోణం ఆసక్తికరమైన అంశంగా కనిపిస్తుంది.